

రోడ్డు శిథిలం.. ప్రయాణం నరకం

వలిగొండ-తొర్రూర్ రోడ్డు నుంచి మత్స్యగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెళ్లే దారి శిథిలమై ప్రమాదాలకు నిలయంగా మారింది. నిత్యం భక్తులు స్వామివారి దర్శనానికి రాకపోకలు కొనసాగిస్తారు. అరకిలో మీటరు దూరం కంకర తేలడంతో ఆలయానికి వెళ్లే భక్తులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి బీటీ నిర్మాణం చేపట్టాలని భక్తులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వలిగొండ

గుట్ట క్షేత్రంలో భక్తజన సందోహం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. యాత్రికుల వాహనాలతో కొండ కింద ఆధ్యాత్మికవాడలోని పార్కింగ్ ప్రాంగణం గజిబిజిగా మారింది. పట్టణ, ఆలయ రహదారులు నిండిపోయాయి.



మెట్ల మార్గంలోనూ రద్దీ కనిపించింది. దర్శనం కోసం భక్తులు బారులు తీరి కనిపించారు. కొండ కింద ఆధ్యాత్మిక వాడలో మొక్కులు తీర్చుకునే వారితో కోలాహలంగా మారింది.



మట్టిని కుప్పలుగా నిల్వ చేశారిలా..

చట్టం వారికి చుట్టం..
గుట్టలు నేలమట్టం

మట్టి అక్రమ తరలింపు జిల్లాలో అడ్డూ అదుపులేకుండా సాగుతోంది. రాత్రి పగలు అనే తేడా లేకుండా ఒక చోటు నుంచి మరో చోటుకు అనుమతులు లేకుండానే తరలిస్తున్నారు. ప్రభుత్వ ఉత్తర్వు నంబరు 14 ప్రకారం మొరం, ఇతర మట్టిని ఒక చోట నుంచి మరోచోటకు తరలించేందుకు ముందస్తుగా మైనింగ్ శాఖ అనుమతి తీసుకోవాలి. సీనరేజీ ఛార్జీల కింద మెట్రిక్ టన్నుకు రూ.26 చొప్పున రాయల్టీ చెల్లించాలి. ప్రభుత్వ ప్రాజెక్టులకు రేట్లలో తేడాలు ఉంటాయి. కానీ ఇవేమీ పాటించకుండా ప్రభుత్వ స్థలాల్లోని గుట్టలు నేలమట్టం అవుతున్నాయి. భువనగిరి పట్టణ పరిసరాల్లోని గుట్టలను పూర్తిగా తవ్వడంతో అడవి పందులు, నెమళ్లు, ఎలుగుబంట్లు ఊళ్లపై పడుతున్నాయి. గతంలో ముత్తిరెడ్డిగూడెం రైల్వే ట్రాక్ వద్ద ఎలుగుబంట్లు రైలు కింద పడి చనిపోయిన ఘటనలు ఉన్నాయి. - భువనగిరి, న్యూస్‌టుడే:

- భువనగిరి మండలం రాయగిరి రెవెన్యూ గ్రామం ముత్తిరెడ్డిగూడెంలోని సర్వే నంబరు 259లో సుమారుగా 250 ఎకరాల వరకు ప్రభుత్వ స్థలం ఉంది. ఇందులో కొంత మైదానం, 70 శాతం వరకు మట్టిదిబ్బలు, గుట్టలు ఉన్నాయి. కొన్నేళ్లుగా పెద్ద ఎత్తున ఎర్రమట్టి, మొరం తరలించుకుపోతున్నారు. 2023 అక్టోబరులో అక్రమ మట్టి తరలింపుపై 'ఈనాడు'లో కథనం ప్రచురితం కావడంతో కొన్నాళ్లు అక్రమ దందా నిలిచిపోయింది. ఆ తదుపరి యథేచ్ఛగా సాగుతోంది. జేసీబీలతో తవ్వేసి నేలమట్టం చేస్తూ భారీ వాహనాల్లో తరలిస్తున్నారు. గుట్టలను 10 నుంచి 15 అడుగుల ఎత్తు వరకు తవ్వకాలు జరిపారు. వెయ్యి టన్నులకు రూ.26 వేల రాయల్టీ చెల్లించాలి. ఇక్కడ లక్షల టన్నుల మట్టిని తరలించారంటే ప్రభుత్వం ఎన్ని లక్షల రూపాయలు నష్టపోయిందో అర్థం చేసుకోవచ్చు.
- కొందరు భవన నిర్మాణాలు, వాణిజ్య నిర్మాణాలు, లేఅవుట్లు, రోడ్లు వేసేందుకు, కట్టలు పోసేందుకు మట్టిని తరలించారు. ఇక్కడ తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవని గనుల శాఖ అధికారులు స్పష్టం చేస్తున్నా.. వేలాది టిప్పర్లు, ట్రాక్టర్ల మట్టిని ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా తరలించుకుపోవడం గమనార్హం. కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో మండల రెవెన్యూ కార్యాలయానికి రెండు కి.మీ దూరం ప్రధాన రహదారికి అర కిమీ దూరంలో ఉన్నా ఎవరూ పట్టించుకోకపోవడం విడ్డూరం.



ముత్తిరెడ్డిగూడెంలో గుట్టను తొలచిన దృశ్యం

అనుమతులు లేవు

- రాఘవరెడ్డి, సహాయ సంచాలకుడు, గనుల శాఖ

ముత్తిరెడ్డిగూడెంలో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. ప్రభుత్వ స్థలం అయితే ముందస్తుగా రెవెన్యూ శాఖ నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి. ఆ తదుపరి దరఖాస్తు చేసుకోవాలి. అప్పుడు అనుమతి ఇస్తాం. టన్నుకు రూ.26 చొప్పున రాయల్టీతో పాటు ఇతర ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది. వాహనాలకు పర్మిట్‌కూడా తీసుకోవాలి.

సంచి నుంచే సన్నాయి నొక్కులు

చౌకధరల దుకాణాల్లో లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ ప్రారంభించినప్పటి నుంచి మండల స్థాయి స్టాక్ పాయింట్ (ఎంఎల్ఎస్) నుంచి డీలర్లకు అందే బియ్యం సంచుల్లో భారీగా దోపిడీ జరుగుతున్నట్లుగా తెలుస్తోంది. 50 కిలోల సంచిలో 2 నుంచి 4 కిలోల వరకు తక్కువగా ఉంటున్నాయి. డీలర్లకు కోత పడుతుండటంతో వారు తూకాల్లో మోసాలకు పాల్పడుతున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి.
- రాజపేట, న్యూస్‌టుడే:



రాజపేట మండలంలోని ఓ రేషన్ దుకాణంలో బియ్యం తూకం వేస్తే ఏకంగా మూడు కిలోలు తక్కువ చూపిస్తూ ఇలా..

2 నుంచి 4 కిలోల వరకు తక్కువగా సరఫరా

- జిల్లాలో మొత్తం 515 రేషన్ దుకాణాలు ఉండగా.. 2,52,265 ఆహారభద్రత కార్డులున్నాయి. యూనిట్లు 7,95,106 ఉన్నాయి. కుటుంబ సభ్యుల సంఖ్యను బట్టి ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున, అన్నపూర్ణ కార్డు దారులకు 10 కిలోలు, అంత్యోదయ కార్డు దారులకు 35 కిలోల చొప్పున పంపిణీ చేస్తున్నారు. వీరికి ప్రతి నెలా 5,034, మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం మూడు నెలలకు 15,104 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేపట్టారు.
- ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 90 శాతానికి పైగా బియ్యం పంపిణీ జరిగినట్లుగా తెలుస్తోంది. ఇవి పక్కదారి పట్టకుండా ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటున్న విషయం తెలిసిందే. ఇంత వరకు బాగానే ఉన్నా బియ్యం బస్తాలో వస్తున్న తరుగుపై డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి నెలా ఈ నష్టాన్ని తామెలా భరించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరలింపు క్రమంలో సంచుల్లో నుంచి జారిపడే గింజలు, రంధ్రాల ద్వారా కిందపడి తక్కువయ్యే అవకాశం ఉండవచ్చని అధికారులంటున్నారు.
- మొత్తంగా ఒక్కో నెలలో సుమారు 50 మెట్రిక్ టన్నులకు పైగా బియ్యం పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలున్నాయి. ఇవి ఎక్కడికి వెళ్తున్నాయి, ఎవరు స్వాహా చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా మారింది. బస్తాలో బియ్యం తక్కువగా వస్తున్నాయని అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని డీలర్లు వాపోతున్నారు. తాజాగా రాజపేట మండలానికి చెందిన ఓ డీలర్ బియ్యం మొత్తం పంపిణీ పూర్తి చేసిన క్రమంలో సుమారు రెండున్నర క్వింటాళ్ల లెక్క తక్కువ వచ్చింది. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా లాభం లేదని, నష్టం తామే భరిస్తున్నామని 'న్యూస్‌టుడే'తో వాపోయారు.
- అయితే మూడు నెలలకు ఒకేసారి పంపిణీ జరుగుతుండటంతో ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా భారీగానే నష్టపోతున్నట్లు తెలుస్తోంది.

మస్తు గిరాఖీ

మూడు రోజుల్లో రూ.7 కోట్ల ఆదాయం రాక

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్టీసీ రికార్డు స్థాయిలో ఆదాయాన్ని సాధించింది. ఆర్టీసీ ఈ నెల 27, 28 తేదీల్లో ప్రత్యేక బస్సులు నడిపింది. ఈ రెండు రోజుల్లో ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో మొత్తం 6.21 లక్షల కిలోమీటర్లు బస్సులు నడవగా.. రూ.4.92 కోట్ల రికార్డు ఆదాయం లభించింది. దీంతో రాఖీ ఆదాయంలో నల్గొండ రీజియన్ రాష్ట్రంలోనే ముందంజలో నిలిచింది.



ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

మూడు రోజుల్లో రూ.7.1 కోట్లు.. రాఖీ పర్వదినం సందర్భంగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రయాణికుల ద్వారా ఆర్టీసీకి ఈ నెల 27, 28, 29 తేదీల్లో మొత్తం రూ.7.1 కోట్ల ఆదాయం లభించింది. ఈ మూడు రోజుల్లో మొత్తం 9.23 లక్షల కిలోమీటర్ల మేర బస్సులు వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించాయి. ఈ నెల 28న అత్యధికంగా రూ.2.87 కోట్ల ఆదాయం రాగా 143 ఓఆర్‌తో రీజియన్ ముందంజలో నిలిచింది. ఆ రోజు 2.83 లక్షల కిలో మీటర్లు బస్సులు నడపాలని అధికారులు లక్ష్యం నిర్దేశించగా 39 వేల కిలోమీటర్లు అదనంగా నడిచాయి. మూడు రోజుల్లో మొత్తం 11 లక్షల మందికి పైగా ప్రయాణికులు బస్సుల్లో ప్రయాణించారు.

డిపోల వారీగా ఈ నెల 27 నుంచి 29 వరకు వచ్చిన ఆదాయం వివరాలు..

డిపో	కిలోమీటర్లు (లక్షల్లో)	ఆదాయం (రూ.కోట్లలో)
దేవరకొండ	1.74	1.26
కోదాడ	1.19	0.81
మిర్యాలగూడ	1.38	0.99
నల్గొండ	1.88	1.34
నార్కట్‌పల్లి	0.32	0.29
సూర్యాపేట	1.90	1.65
యాదగిరిగుట్ట	1.07	0.74

సూర్యాపేటలో అత్యధికం.. మూడు రోజులు కలిపి సూర్యాపేట డిపో పరిధిలో మొత్తం 1.90 లక్షల కిలోమీటర్లు బస్సులు నడపగా.. ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా రూ.1.65 కోట్ల ఆదాయం వచ్చింది. డిపో నుంచి మూడు రోజుల్లో అత్యధికంగా 2.60 లక్షల మంది రాకపోకలు సాగించారు. ఈనెల 28న 97 వేల మంది బస్సుల్లో ప్రయాణించారు. సోమవారం ప్రయాణికులు తిరుగు ప్రయాణం చేయనున్న నేపథ్యంలో ఆదాయం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఎటూ తోచడం లేదు.. సర్

అయోమయంలో ఓటర్లు

ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ పత్రాల్లో ఓటర్లు పేర్కొన్న వివరాల్లో లోపాలున్నాయని ఎన్నికల సంఘం అధికారులు నోటీసులు జారీ చేస్తున్నారు. నోటీసులు అందుకున్న ఓటర్లలో ఎంతమంది తుది జాబితాలో మిగులుతారనే దానిపై త్వరలో స్పష్టత రానుంది.
- ఈనాడు, నల్గొండ, రాజపేట, న్యూస్‌టుడే:



రాజపేట మండలం మొల్లగూడెంలో నోటీసులు అందజేస్తున్న బీఎల్వో

- సర్ నిబంధనల ప్రకారం ప్రస్తుత జాబితాలోని ఓటర్లు 2002 నాటి జాబితాలోని తమ పేరు, తల్లిదండ్రుల పేరు, తాత, నానమ్మల పేర్లు, వివరాలతో మ్యాపింగ్ చేసుకోవాలి. బీఎల్‌వోలకు సమర్పించిన ఎన్యూమరేషన్ పత్రాల్లో చాలామంది ఓటర్లు తమ వివరాలను మ్యాపింగ్ చేయకుండా వదిలేశారు. మరికొందరు తప్పిదాలు, లోపాలతో కూడిన వివరాలతో మ్యాపింగ్ చేసుకున్నారు. దీంతో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 5,56,576 మందికి నోటీసులు జారీ చేశారు.
- ఈ నెల 27 నుంచి నోటీసులు ఇచ్చే ప్రక్రియ ప్రారంభం కాగా ఇంటింటికీ అందజేయడంలో ఆలస్యం జరుగుతోంది. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించడంతో నోటీసులు అందుకునే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా, అర్హులైన ఏ ఒక్కరి ఓటు తొలగించకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.
- నోటీసులు అందుకున్న వారి సమస్యలు పరిష్కరించేందుకు గ్రామపంచాయతీలు, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో, పోలింగ్‌స్టేషన్, బూత్‌లలో హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు.
- వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్యంతో ఉన్నవారికి జారీ చేసిన నోటీసులను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. సదరు ఓటర్ల తరఫున కుటుంబంలోని వయోజన సభ్యులు, ఈఆర్‌వో, ఏఈఆర్వో ఎదుట ప్రత్యక్షంగా హాజరై అవసరమైన ధ్రువీకరణ పత్రాలు, సమాచారాన్ని అందించేందుకు అనుమతి ఇస్తున్నారు.
- ప్రస్తుత ఓటర్ జాబితాలోని ఓటరు పేరుకు 2002 సర్‌లోని ఓటరు పేరుకు మధ్య తేడా, పొంతన లేకుండా ఉండటం, 2002 ఎస్ఐఆర్ జాబితాతో ఓటరు జాబితా అనుసంధానించడానికి ఉపయోగించిన వివరాల ప్రకారం వారి తల్లి, తండ్రికి మధ్య వయస్సులో వ్యత్యాసం 15 ఏళ్ల కంటే తక్కువగా ఉంటే ఓటర్లకు నోటీసులు జారీ అవుతున్నాయి.
- సర్ ప్రక్రియకు ముందు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొత్తం 29,84,448 మంది ఓటర్లు ఉండగా సర్ ప్రక్రియ తర్వాత వెల్లడించిన ముసాయిదాలో 27,03,385 మంది ఓటర్లు ఉన్నారు.

వివరాలు ఇలా..

జిల్లా	గతంలో	ముసాయిదా	తగ్గుదల	మరణించిన వారు	బదిలీ	అందుబాటులో లేనివారు	నోటీసులు
నల్గొండ	15,16,253	13,57,618	1,58,635	32,517	1,00,144	6,978	2,68,798
సూర్యాపేట	10,08,252	9,11,945	96,307	26,059	48,310	6,862	1,90,676
యాదాద్రి	4,59,943	4,33,822	26,121	7,156	14,604	1,176	97,102



పత్తి కొనుగోళ్లకు టెండర్లు

భానుపురి, న్యూస్‌టుడే: పత్తి కొనుగోళ్లకు సంబంధించి సీసీఐ టెండర్లను ఆహ్వానించింది. మరో రెండు నెలల్లో పంట చేతికొచ్చే అవకాశం ఉండటంతో సంబంధిత అధికారులు ముందుగానే టెండర్లకు సిద్ధమయ్యారు. ఉమ్మడి జిల్లాలో 2026-27 సీజన్‌లో పత్తి కొనుగోళ్లకు సంబంధించి కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) జిన్నింగ్, ప్రెస్సింగ్ టెండర్లను కోరింది. జిల్లాలో 42 కేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు జిన్నింగ్ మిల్లుల్లో బేళ్ల కోసం టెండర్లు ఆహ్వానించింది. గతంలో ధరలతో పాటు ఇతర నిబంధనలతో ఒకే టెండర్ ప్రకటన ఇచ్చేవారు. అలాంటిది ఈ సీజన్‌లో తొలి విడత ధరల ప్రస్తావన లేకుండా ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలంటూ టెండర్ ప్రకటన ఇచ్చింది.

సాగు ఇలా.. ఉమ్మడి జిల్లాలో ఈ సీజన్‌లో పత్తి 10.5 లక్షల ఎకరాల్లో సాగు చేశారు. అధికారుల లెక్కల ప్రకారం 80 లక్షల క్వింటాళ్ల పత్తి వచ్చే అవకాశం ఉంది. మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేసే సీసీఐ పత్తిని గింజలు తీసి బేళ్లుగా మార్చి సరఫరా చేయడానికి ఏటా టెండర్లు ఆహ్వానిస్తుంది. ఒకటి రెండు నెలల్లో క్రయవిక్రయాలు ప్రారంభించే అవకాశం ఉండటంతో వ్యాపారులతో పాటు సీసీఐ పత్తి కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

42 కేంద్రాలు... జిల్లాలో 21 మార్కెట్ యార్డుల పరిధిలో 42 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. నల్గొండ 23, యాదాద్రి 13, సూర్యాపేట జిల్లాలో 6 సీసీఐ కేంద్రాలు ఏర్పాటు కానున్నాయి. గతంలో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఈసారి కూడా అవే ఏర్పాటు చేస్తున్నారు. కేంద్రాల వారీగా కొనుగోలు చేసే పత్తిని బేళ్లుగా మార్చేందుకు ఏటా జిన్నింగ్‌లను అద్దెకు తీసుకుంటున్నారు. జిల్లాల వారీగా సాగు, పత్తి దిగుబడుల అంచనాల మేరకు కొనుగోలు కేంద్రాలు, జిన్నింగులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ సీజన్‌లో జిన్నింగ్‌లు, గిడ్డంగులు, బేళ్ల రవాణాకు వాహనాలు, తాత్కాలిక ఉద్యోగులు తదితర వాటికి కూడా టెండర్లను ఆహ్వానించినట్లు మార్కెటింగ్ శాఖ అధికారులు 'న్యూస్‌టుడే'కి తెలిపారు.

అల్లంత దూరంలో ఉల్లి.. వంటింట్లో లొల్లి

విపరీతంగా పెరిగిన నిత్యావసర, కూరగాయల ధరలు

నిత్యావసర సరకుల ధరలు సామాన్యుడికి దడ పుట్టిస్తున్నాయి. నిత్యం ఉపయోగించే చక్కెరతో మొదలై బియ్యం, ఉల్లిగడ్డ, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నెల కిందట రూ.250 వెచ్చిస్తే వారానికి సరిపడా కూరగాయలు వచ్చేవి. ఇప్పుడు రూ.500 వెచ్చించాల్సి వస్తుంది. బియ్యం ధరలు అమాంతం పెరిగాయి.
- రాజపేట, భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే:



- ప్రతి ఇంట్లో కచ్చితంగా ఉపయోగించే వెల్లుల్లి ఘాటెక్కింది. రెండు నెలల కింద కిలో రూ.150 ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.280కి చేరింది. రూ.100కు ఆరు కిలోలు లభించే ఉల్లిగడ్డ ఇప్పుడు రెండు కిలోలే ఇస్తున్నారు. ఉదయం లేవగానే టీ తాగడం దినచర్యలో భాగం. ఇందుకు అవసరమైన చక్కెర కిలో రూ.70 పలుకుతోంది. బెల్లం రూ.45 నుంచి రూ.70కి చేరింది. శ్రావణ మాసంలో నిత్యపూజలు ఉంటాయి. ఈ పరిస్థితుల్లో ధరలు పెరగడం సామాన్యుడికి ఇబ్బంది కలిగించే పరిణామమే.
- ఇటీవల కొద్దిగా కురిసిన ముసురుకు జిల్లాలో కూరగాయల తోటలు దెబ్బతినడం, మచ్చలు ఏర్పడటం జరిగాయి. ఈ కారణంగా వీటి ధరలు కూడా పెరిగాయి. కిలో పచ్చిమిర్చి రూ.80 పలుకుతోంది. ఆకుకూరలు సైతం రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు. కోతుల సమస్య కారణంగా కూరగాయల సాగు తగ్గింది.

కొన్ని కూరగాయల ధరలు ఇలా.. (రూ.లలో)

టమాట	30
చిక్కుడు	80
బీన్స్	70
క్యారెట్	60
క్యాప్సికం	60
క్యాలీఫ్లవర్	60
కాకర	80
బెండ	60
బీర	60
బీట్‌రూట్	60

పక్కాగా పంట లెక్కలు

కచ్చితమైన సాగు వివరాల కోసం సర్వే



పొలానికి వెళ్లి చరవాణిలో ఫొటో తీసుకుంటున్న దృశ్యం

కచ్చితమైన సాగు వివరాల నమోదు లక్ష్యంగా జియోఫెన్సింగ్, ఉప గ్రహ సాంకేతికతతో జిల్లాలో డిజిటల్ క్రాప్ సర్వే (డీసీఎస్)ను చేపట్టారు. వారం రోజులుగా సిబ్బంది సర్వే చేస్తున్నారు. రైతు ప్రయోజనాలతో పాటు కొనుగోళ్లు, పంటలకు నష్టం జరిగినప్పుడు పరిహారం చెల్లించేందుకు కచ్చితమైన వివరాలు సేకరిస్తున్నారు.
- భువనగిరి, భువనగిరి గ్రామీణం,న్యూస్‌టుడే:

పొలం వద్దకే వెళ్లి నమోదు.. డిజిటల్ క్రాప్ సర్వే కోసం జిల్లా వ్యవసాయ శాఖ 318 రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేపట్టింది. సాంకేతిక పరిజ్ఞానం కలిగిన యువతీ యువకులను సర్వేయర్లుగా ఎంపిక చేసింది. 278 మంది డీసీఎస్‌లో నిమగ్నమయ్యారు. ఒక్కొక్కరికి గరిష్ఠంగా 4,500 సర్వే నంబర్లు కేటాయించారు. ఒక ఎంట్రీని ఒక సర్వే నంబరుగా పరిగణిస్తారు. రైతులు పంట పొలం వద్దకు వెళ్లగానే యాప్ తెరిచిన వెంటనే రైతు పేరు సర్వే నంబరు వస్తుంది. ఏ పంట సాగు చేశారో రైతులు చెప్పి నమోదు చేయించుకోవాలి. ఫొటో తీసి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఒక వేళ సిగ్నల్ సమస్య ఎదురైతే సర్వేయర్ రైతు వేసిన పంటను ఫొటో తీసి తదుపరి యాప్‌లో నమోదు చేసే వెసులుబాటు ఉంది.

- జిల్లాలో 318 రెవెన్యూ గ్రామాల్లో సర్వేయర్లను నియమించాల్సి ఉంది. 272 మంది మాత్రమే ఉన్నారు. 46 మంది తక్కువగా ఉన్నారు. రామన్నపేట, వలిగొండ మండలాల్లో కొరత ఎక్కువగా ఉంది. ఒక్కొక్క సర్వేయర్‌కు 4,500 ఎకరాలకు మించకుండా కేటాయించారు. మొత్తం 3.80 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేశారు. గడువులోపు పూర్తి చేయడం కష్టమేనని రైతులు అంటున్నారు.

అక్టోబరు మొదటి వారంలోగా పూర్తి చేస్తాం:

- పీవీ రమణారెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి

అక్టోబరు మొదటి వారం లోపు సర్వే పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. సర్వే వేగంగా సాగుతోంది. కచ్చితమైన వివరాలు సేకరిస్తున్నాం.

చేయూత పింఛన్ల దరఖాస్తుకు నేడే ఆఖరు

భువనగిరి, న్యూస్‌టుడే: సామాజిక భద్రతా పింఛన్ల కోసం అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. వితంతువులు, ఒంటరి మహిళలు , దివ్యాంగులు, రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులు, పైలేరియా బాధితులకు ప్రభుత్వం చేయూత పింఛన్ల ద్వారా సామాజిక భద్రత కల్పిస్తోందన్నారు. పింఛన్ల దరఖాస్తు ఫారాలను చేయూత వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తులు నింపిన అనంతరం ఎంపీడీవో, గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించాలని సూచించారు.

సార్లకు..సర్దుపోటు

భువనగిరి పట్టణం, న్యూస్‌టుడే: విద్యా సంవత్సరం ప్రారంభమై నెలలు పూర్తయినా.. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలలకు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల సర్దుబాటు జరగలేదు. జిల్లా వ్యాప్తంగా 655 ప్రభుత్వ పాఠశాలల్లో 37,095 మంది విద్యను అభ్యసిస్తున్నారు. పాఠశాలల అవసరాన్ని బట్టి విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై నియమించాల్సి ఉంది. ప్రస్తుతం చేపట్టిన సర్దుబాటులో జిల్లా పరిధిలోని పాఠశాలల్లో 18 మంది స్కూల్ అసిస్టెంట్లు, 26 మంది ఎస్జీటీలను డిప్యుటేషన్‌పై పలు పాఠశాలల్లో నియమించారు. నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా కొనసాగలేదని పలు సంఘాల నుంచి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



తరగతిలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- జిల్లాను యూనిట్‌గా తీసుకుని జరగాల్సిన సర్దుబాటు ప్రక్రియ మండలానికి పరిమితం చేసినట్లు తెలుస్తోంది. జిల్లా పరిధిలోని పాత పాఠశాలలు, మండల కేంద్రాల్లోని పాఠశాలల్లో సింగిల్ ప్యాట్రన్ కింద 200 మంది విద్యార్థులు ఉన్నప్పటికి ఒక సబ్జెక్ట్ టీచర్ ఉండాలి. కానీ పలు పాఠశాలల్లో ఒక్కో సబ్జెక్ట్‌కు ఇద్దరు, ముగ్గురు ఉపాధ్యాయులు పనిచేస్తుండటం గమనార్హం.
- నిబంధనల మేరకు ప్రాథమిక పాఠశాలల్లో ఐదు తరగతులకు 18 పాఠ్యాంశాలు బోధించాల్సి ఉంటుంది. ఇక్కడ ఒక్కో పాఠశాలకు ఐదుగురు ఉపాధ్యాయులు, ఒక ప్రధానోపాధ్యాయుడిని నియమించాల్సి ఉంది. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 14 పాఠ్యాంశాలను ఐదు తరగతుల్లో బోధించేందుకు తొమ్మిది మంది ఉపాధ్యాయులు, ఒక ప్రధానోపాధ్యాయుడు అవసరం ఉంటుంది. ఈ మేరకు అవసరం ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించిన పక్షంలో విద్యార్థులకు ప్రయోజనం చేకూరి ప్రభుత్వ లక్ష్యం నెరవేరే అవకాశం ఉంది.

అవసరాల మేరకు సర్దుబాటు చేశాం

- బొల్లారం భిక్షపతి, జిల్లా విద్యాశాఖాధికారి

ప్రస్తుతం అవసరాల మేరకు మండలం యూనిట్‌గా ఉపాధ్యాయులను సర్దుబాటు చేశాం. జిల్లా వ్యాప్తంగా ఇంకా కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఉంది. ప్రస్తుత పరిస్థితులను, జిల్లా యూనిట్‌గా చేయాల్సిన విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించి వారి ఆదేశాల మేరకు ప్రక్రియ చేపడతాం.

ఆర్టీసీ సేవ.. సాంకేతిక తోవ

మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: ప్రయాణికులకు మరింత చేరువయ్యేందుకు ఆర్టీసీ సాంకేతికంగా పలు వినూత్న మార్పులకు శ్రీకారం చుడుతోంది. యూపీఐ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపుల నుంచి.. బస్సు ఎక్కడుందో తెలుసుకోవడం వరకు పలు సంస్కరణలు తీసుకొచ్చింది. దీంతో పాటు.. పర్యావరణ హిత విద్యుత్తు బస్సులను, అందులో సీసీ కెమెరాలు వంటి సదుపాయాలు సైతం కల్పిస్తూ దూసుకుపోతోంది. మిర్యాలగూడ, నల్గొండ వంటి డిపోల్లో ముందస్తు ఆన్‌లైన్ రిజర్వేషన్ సదుపాయం సైతం అందుబాటులో ఉంది. తాజాగా స్మార్ట్ టికెట్ విధానాన్ని సైతం ప్రారంభించేందుకు ఆర్టీసీ సన్నద్ధమైంది.

ఉమ్మడి జిల్లాలో డిపోలు ఇవీ..
నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, దేవరకొండ, యాదగిరిగుట్ట, నార్కట్‌పల్లి.



మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

స్మార్ట్ టికెట్ పని చేసే విధానం ఇదీ..

✦ తొలుత బస్సుకు ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయాలి.
✦ అనంతరం మీ టికెట్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఇన్‌స్టాల్ చేసుకోవాలి.
✦ మీ టికెట్ యాప్‌ను తెరచి టీజీఆర్టీసీ కరెంట్ బుకింగ్ ఐచ్ఛికాన్ని ఎంపిక చేసుకోవాలి.
✦ ప్రయాణం, ప్రయాణికుల వివరాలు నమోదు చేయాలి.
✦ బుకింగ్‌ను నిర్ధారించడానికి చెల్లింపును పూర్తి చేయాలి.
✦ చెల్లింపు నిర్ధారణ తరువాత ఒక క్యూఆర్ కోడ్ వస్తుంది.
✦ ఇది వరకే మీ టికెట్ యాప్ ఉన్న వారు.. మీ టికెట్ క్యూఆర్ కోడ్ స్కానర్ ద్వారా బస్సు లోపల ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే.. కరెంట్ బుకింగ్ ఐచ్ఛికం కనిపిస్తుంది. అక్కడ వివరాలు నమోదు చేసి.. టికెట్ పొందొచ్చు.

యూపీఐ చెల్లింపులు...

ప్రస్తుత డిజిటల్ యుగంలో అధిక శాతం మంది యూపీఐ, ఆన్‌లైన్ చెల్లింపులకు మొగ్గు చూపుతున్నారు. దీంతో బస్సుల్లో టికెట్ తీసుకునేందుకు చిల్లర సమస్య తలెత్తకుండా యూపీఐ చెల్లింపులను ప్రవేశ పెట్టింది. దీని కోసం అధునాతన టిమ్ యంత్రాలను సైతం తీసుకొచ్చింది. వీటి ద్వారా ప్రయాణికులు యూపీఐ స్కానర్‌ను స్కాన్ చేసి.. టికెట్ ఛార్జీ చెల్లించవచ్చు. ఇది ఎంతో మందికి ఉపయోగకరంగా ఉంది.

బస్సు ఎక్కడుందో..?

ప్రయాణికులు ఎక్కాల్సిన బస్సు ఎక్కడుందో తెలుసుకోవడం కష్టంగా ఉండేది. బస్టాండ్‌లో సిబ్బందిని అడిగినా సరైన సమాధానం వచ్చేది కాదు. గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. దీనిని నివారించేందుకు ఆర్టీసీ 'గమ్యం' పేరుతో ఒక యాప్‌ను ప్రవేశ పెట్టింది. ఈ యాప్‌లో బస్సు నెంబర్, రూట్ నెంబర్ ఆధారంగా బస్సు ఎక్కడుందో తెలుసుకోవచ్చు. బస్సు బస్టాండ్‌కు ఎప్పుడు చేరుతుందో యాప్ ద్వారా తెలుసుకోవచ్చు.

సద్వినియోగం చేసుకోవాలి..

– జ్యోత్స్న, ఆర్టీసీ ఆర్ఎం, నల్గొండ



సాంకేతిక పరంగా ఆర్టీసీ అందిస్తున్న సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలి. ఆన్‌లైన్ రిజర్వేషన్‌తో పాటు.. యూపీఐ చెల్లింపులు, గమ్యం యాప్ వంటివి ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి. తాజాగా రానున్న స్మార్ట్ టికెట్ విధానం సైతం సమయాన్ని ఆదా చేయడంతో పాటు.. చిల్లర సమస్యకు చెక్ పెడుతుందని ఆశిస్తున్నాం.

ఆటకు.. ఆరు గంటలు



బౌలింగ్ చేస్తున్న ఊట్కూరి యశ్వీర్‌గౌడ్

రాజాపేట, ఆలేరు, న్యూస్‌టుడే: అండర్-19 భారత క్రికెట్ జట్టుకు రాజాపేట మండల కేంద్రానికి చెందిన క్రీడాకారుడు ఊట్కూరి యశ్వీర్‌గౌడ్ రెండో సారి ఎంపికయ్యారు. తాజాగా సెప్టెంబరు 18, 21, 23 తేదీల్లో ఆస్ట్రేలియా జట్టుతో జరగనున్న వన్డే క్రికెట్ పోటీల్లో భారత తరఫున ఆడనున్నాడు. అంతకు ముందు గత జులై 1 నుంచి శ్రీలంకలో జరిగిన మూడు వన్డే సిరీస్‌లోనూ యశ్వీర్ పాల్గొని ప్రతిభ చూపడం విశేషం.

✦ హైదరాబాద్‌లో డిగ్రీ చదువుతున్న ఈ యువకుడు రాజ్‌కుమార్, వాణి కుమారుడు. చిన్న వయసు నుంచే తన కుమారుడు క్రికెట్ ఆట పట్ల ఉన్న మక్కువను దృష్టిలో పెట్టుకుని తల్లిదండ్రులు ఆ రంగంలో తర్ఫీదు ఇప్పించారు. స్థానికంగా 'భవన్స్' అకాడమీలో చేర్పించారు. కోచ్ కృష్ణమోహన్ తర్ఫీదు, మెలకువలు నేర్పిన కారణంగా యశ్వీర్ ఇప్పటి వరకు పలు ట్రోఫీల్లో 50 కిపైగా మ్యాచ్‌లు ఆడి ప్రతిభ చూపడం విశేషం.

✦ అండర్-16 విభాగంలో 2023-24లో బీసీసీఐ ట్రోఫీలో ఆడిన 5 మ్యాచ్‌ల్లో 20 వికెట్లు, 125 పరుగులు తీయడం విశేషం. అలాగే అండర్-19 విభాగంలో రంజీ ట్రోఫీలో రాజ్‌కోట్‌లో ఆడిన వన్డే మ్యాచ్‌లోనూ ఏకంగా 6 వికెట్లు పడగొట్టిన ఘనత ఈ యువకుడి సొంతం. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో (అండర్-19) కేరళ రాష్ట్ర జట్టుతో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో ఎనిమిది వికెట్లు తీసుకుని జట్టు గెలుపునకు కీలకమయ్యాడు. ఈ మ్యాచ్‌లో తన బ్యాటింగ్ ప్రతిభను కూడా చూపే క్రమంలో 118 పరుగులు సాధించి ప్రత్యర్థి జట్టును చిత్తు చేశాడు. రోజులో కనీసం 6 గంటలు మైదానంలో క్రికెట్ సాధన చేపడుతున్న ఈయనకు అటు క్రికెట్, ఇటు చదువుపైనే తన పూర్తి ధ్యాస అంటున్నాడు.

ప్రజలకు చేరువగా.. సేవలు మెరుగ్గా

మిర్యాలగూడ, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు మెరుగైన సేవలందించేందుకు టీజీఎన్‌పీడీసీఎల్ ఆధునిక సాంకేతికతను అందుబాటులోకి తీసుకొచ్చింది. వాట్సాప్ చాట్‌బాట్‌కు కృత్రిమ మేధ (ఏఐ) అనుసంధానం చేసింది. విద్యుత్తు కార్యాలయాలకు వెళ్లకుండానే అవసరమైన పూర్తి సమాచారం తమ చరవాణి నుంచే తెలుసుకునే వెసులుబాటు కల్పించింది. 24 గంటలు, ఏడు రోజుల పాటు నిరంతరాయంగా ఉండేలా తీర్చిదిద్దారు.

◆ చరవాణిలో వాట్సాప్ ద్వారా నంబరును సంప్రదించి హాయ్ అనే సందేశం పంపించగానే టీజీఎన్‌పీడీసీఎల్ కస్టమర్ సపోర్ట్‌కి స్వాగతం! మీ విద్యుత్తు సేవల్లో మీకు సహాయం చేయడానికి మేము సంతోషంగా ఉన్నాం.. మీకు ఈ రోజు ఏ విధంగా సహాయం చేయగలం? అని సందేశం వస్తుంది. బిల్లుల వివరాలు, చెల్లింపు స్థితి, విద్యుత్తు అంతరాయ సమాచారం, ఫిర్యాదు నమోదు, కొత్త కనెక్షన్ ప్రక్రియ, కేటగిరీ మార్పు ప్రక్రియ, పేరు మార్పు ఇలా పలు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు.

1912కు సమాచారం ఇస్తే...

జిల్లాలో సుమారు 6 లక్షల విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం సర్కారు, ఉత్తర తెలంగాణ విద్యుత్తు పంపిణీ మండలి ఒక దరఖాస్తు పలు ప్రయోజనాలు అనే దానిని తీసుకొచ్చి సేవలను మరింత విస్తృతం చేసింది. స్థానికంగా ఏవైనా సమస్యలుంటే టోల్ ఫ్రీ నంబరు 1912కు సమాచారం అందజేస్తే ఆ ఫిర్యాదులను నమోదు చేసి సంబంధిత అధికారులకు చేరవేసేలా సాంకేతికతను రూపొందించారు. అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో సందర్శించి వాటిని పరిష్కరించేలా తీర్చిదిద్దారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మిర్యాలగూడ విద్యుత్తు డీఈ శ్రీనివాసాచారి కోరారు.

అమ్మాయిల చదువుకు ఆసరా

మీ కోసం

నాంపల్లి, చండూరు, న్యూస్‌టుడే: అమ్మాయిలూ ఇది మీ కోసమే.. ఇంటర్ పూర్తి చేసి ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థినులకు 'కోటక్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్' ఆధ్వర్యంలో 'కోటక్ కన్య స్కాలర్‌షిప్ 2026-27' పేరుతో ఉపకార వేతనాలను అందిస్తోంది. అందుకు దరఖాస్తులు సమర్పించేందుకు గడువు ఈ నెల 31తో ముగుస్తుంది.

■ **ఇవీ అర్హతలు..:** నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థినులు వారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలు మించని వారంతా అర్హులే. ఇంటర్‌లో 75శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించి, 2026-27 విద్యా సంవత్సరంతో మొదటి ఏడాది ఇంజినీరింగ్, ఎంబీబీఎస్, ఇంటిగ్రేటెడ్ ఎల్ఎల్‌బీ వంటి కోర్సుల్లో చదువుతున్న విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత సాధిస్తే ఏడాదికి రూ.1.50 లక్షల చొప్పున కోర్సు పూర్తి చేసేవరకు ఉపకార వేతనంగా కోటక్ ఫౌండేషన్ అందించనుంది.

■ **దరఖాస్తు ఇలా..:** ఇందుకు ఆన్‌లైన్‌లో kotakeducationfoundation.gov.in వెబ్‌సైట్‌లోకి వెళ్లి kotakkanyascholarship2026-27 పై క్లిక్ చేసి నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమయంలో ఇంటర్ ఉత్తీర్ణత సర్టిఫికెట్, కుటుంబ ఆదాయ ధ్రువపత్రం, కళాశాల నుంచి పొందిన ఫీజు వివరాల పత్రం, కళాశాల నుంచి బోనఫైడ్ ధ్రువపత్రం, కళాశాలలో ప్రవేశ అనుమతి లేఖ, ప్రవేశ పరీక్షలో సాధించిన ర్యాంకు కార్డు, ఆధార్, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో వంటి వివరాలతో నమోదు చేసుకోవచ్చు.

ఆధునిక వంటశాల ఏర్పాటుకు సన్నాహాలు

నడిగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అల్పాహారం కార్యక్రమంలో భాగంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ సిద్ధం చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. కిచెన్ నిర్మాణానికి సుమారు రూ.3 కోట్లు మంజూరు చేశారు. ఈ పనులను విద్యా మౌలిక సదుపాయాల కల్పన విభాగం పర్యవేక్షణ చేయనుంది. సూర్యాపేట కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న కిచెన్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నాణ్యమైన పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించనున్నారు. గతంలో పాఠశాల విద్యార్థులకే అందుబాటులో ఉన్న మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రభుత్వం ఈ ఏడాది నుంచి ఇంటర్ విద్యార్థులకు అమలు చేయనుంది. మోడల్ ప్రాజెక్ట్‌గా కొన్ని జిల్లాల్లో అమలులో ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల పరిధిలో తొలిసారిగా ఏర్పాటు చేసిన పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 56 కళాశాలల్లో ఈ పథకాన్ని అమలు చేస్తున్నారు. నవంబరు మొదటి వారం నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, మధ్యాహ్న భోజనం అందించాలని నిర్ణయించారు. సూర్యాపేటలోని సమీకృత మార్కెట్ ఆవరణలో కిచెన్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. రెండు నెలల్లో పూర్తి చేసి విద్యార్థులకు అందించాలనేది లక్ష్యం.

మెనూ ఇలా..
విద్యార్థులకు పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించేందుకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషియన్ సూచనల మేరకు మెనూ రూపొందించారు.
సోమవారం: ఇడ్లీ సాంబార్
మంగళవారం: పూరీ, ఆలుకూర్మ
బుధవారం: దోశ, చట్నీ
గురువారం: ఉప్మా చట్నీ
శుక్రవారం: మిల్లెట్ ఇడ్లీ, సాంబార్
శనివారం: బోండా, చట్నీ

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు..

జిల్లా	కళాశాలల సంఖ్య
నల్గొండ	27
యాదాద్రి	17
సూర్యాపేట	8

వాహనాల బారులు



చౌటుప్పల్, న్యూస్‌టుడే: చౌటుప్పల్‌లో ట్రాఫిక్ కష్టాలు ఆదివారం మరింత పెరిగాయి. రద్దీ మూలంగా కిలోమీటర్ల దూరం నిలిచిపోయిన వేల సంఖ్యలో వాహనాలు నెమ్మదిగా కదిలాయి. స్థానికంగా జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ వంతెన నిర్మాణం జరుగుతున్నందున కొన్ని నెలలుగా సర్వీసు రోడ్డుపైకి వాహనాలను మళ్లించారు. ఇరుకైన సర్వీసు రోడ్డుపై వందల కొలదీ వాహనాలు, స్థానిక పాదచారులు రాకపోకలు సాగించడానికి నిత్యం నరక యాతన పడుతున్నారు. దీనికి తోడు ఆదివారం చౌటుప్పల్‌లో వార సంతను జాతీయ రహదారి పక్కనే నిర్వహిస్తుంటారు. స్థానికులు, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు, పరిశ్రమల్లో ఉపాధి కోసం వలసొచ్చిన పొరుగు రాష్ట్రాల కూలీలు సంతలో సరకుల కొనుగోళ్ల కోసం వస్తారు. మరో దారిలేక సర్వీసు రోడ్డులోంచే వాహనాలను తప్పించుకుంటూ జాతీయ రహదారిని ప్రమాదకర పరిస్థితుల్లో దాటాల్సి వస్తుంది. జాతీయ రహదారి పక్కనే కల్యాణ మండపాలున్నాయి. ఆదివారం ఈ మండపాల్లో నిర్వహించిన శుభకార్యాల్లో పాల్గొనేందుకు వచ్చిన ప్రజలు, వాహనాలతో లక్కారం ప్రాంతంలోని సర్వీసు రోడ్డు కిక్కిరిసింది. అక్కడి అండర్‌పాస్‌లో వాహనాలు ముందుకు, వెనక్కు కదలలేని పరిస్థితి ఏర్పడింది. అదే సమయంలో అక్కడికొచ్చిన మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కారులోంచి కిందికి దిగి వాహనాలను క్రమబద్ధీకరించేందుకు కొద్దిసేపు శ్రమించారు. పోలీసులు వాహనాల రద్దీని క్రమబద్ధీకరించేందుకు శ్రమించారు.

ఆదర్శమవనున్న పాఠశాలలు

కొండమల్లేపల్లి, న్యూస్‌టుడే: ఆదర్శ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా విద్యాశాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే వచ్చే ఏడాది నుంచి ఈ పాఠశాలల్లో సీబీఎస్ఈ విధానాన్ని ప్రవేశపెట్టాలన్న యోచనలో ఉంది. ఇందుకుగాను విద్యాశాఖ ఇటీవల ప్రభుత్వ అనుమతి కోసం ప్రతిపాదనలు పంపింది. ఈ విధానం ప్రవేశపెడితే పిల్లల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం ఆదర్శ పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు బోధిస్తున్నారు. అదనంగా ప్రీప్రైమరీతో పాటు 1-5 వరకు తరగతులనూ ప్రారంభించాలన్న ఆలోచన ఉంది. అయితే ప్రస్తుతం ఆదర్శ పాఠశాలలన్నీ చాలా వరకు ఊరికి దూరంగా ఉండటంతో రవాణా సౌకర్యం సరిగ్గా లేకపోవడం వల్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు గురుకులాలు, కస్తూర్బాలు పెరగడంతో వీటిల్లో చేరే వారి సంఖ్య తగ్గుతూ వస్తోంది. ఈ నేపథ్యంలో సీబీఎస్ఈ సిలబస్‌తోపాటు ప్రైమరీ నుంచి 5వ తరగతి వరకు తరగతులను ప్రారంభిస్తే ప్రవేశాలు పెరిగే అవకాశం ఉంటుందని విద్యాశాఖ అంచనా వేస్తోంది. ప్రభుత్వం నుంచి త్వరలోనే ఆమోదం వచ్చే అవకాశాలున్నట్లు దేవరకొండ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ ఆశీర్వాదం 'న్యూస్‌టుడే'కు తెలిపారు. ఆదర్శ పాఠశాలల్లో చాలా వరకు గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులే అధికంగా ఉండటంతో ఈ విధానంతో వారికి లబ్ధి చేకూరుతుందని ఆయన తెలిపారు.

జిల్లా	ఆదర్శ పాఠశాలలు
నల్గొండ	17
సూర్యాపేట	09
యాదాద్రి	07

అక్టోబరు 18న యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న మహిమ, శంకర్, విజయానంద్, అర్జున్, విక్రమ్ సాగర్, రాజా, రమణ

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: యువతలో విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందించేందుకు పసాలా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 18న భువనగిరి జిల్లా మోత్కూర్‌లో ఉచిత 'యూత్ ఎంపవర్‌మెంట్ ఫెస్ట్' నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు విక్రమ్ సాగర్ పసాలా, సహ వ్యవస్థాపకుడు, ఛైర్మన్ అర్జున్ మదాసు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో వారు కార్యక్రమం గోడపత్రికను ఆవిష్కరించారు. ఫెస్ట్‌లో విద్యార్థులు, యువత, విద్యావేత్తలు, నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, కమ్యూనిటీ ప్రతినిధులను ఒకే వేదిక పైకి తీసుకొచ్చి విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, సాంకేతికత, నాయకత్వం, వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. ఫౌండేషన్ పిల్లలు, యువత, మహిళలు, రైతులు, వృద్ధులకు విద్య, సాధికారత, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి, సామాజిక అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఫెస్ట్‌లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో ఫౌండేషన్ సీఈవో గోకుల్ రమణ, ప్రోగ్రామ్ డైరెక్టర్ రాజా, రీజినల్ కోఆర్డినేటర్ పసాలా విజయానంద్, ప్రతినిధులు శంకర్, జి.మహిమ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భళా.. శ్రీవిద్య



మోత్కూరు, న్యూస్‌టుడే: మోత్కూరుకు చెందిన తాపీ మేస్త్రీ బోడ శ్రీరాములు కుమార్తె శ్రీవిద్య యూజీసీ నెట్-జేఆర్ఎఫ్ జూన్ 2026 పరీక్షల్లో 98.4 పర్సంటేజ్ సాధించి ప్రతిభ చాటింది. చిన్న వయస్సు నుంచే విద్యలో రాణిస్తున్న ఆమె ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యనభ్యసించి డీఆర్‌డీఏ ద్వారా కార్పొరేట్ కళాశాలలో ఉచిత విద్య, ఉపకార వేతనాలతో ఇంటర్ పూర్తి చేసింది. పీజేటీఎస్ఏయూలో ప్రభుత్వ విద్యనభ్యసించి బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసింది. రాయపూర్‌లో ఐజీకేవీలో ప్రభుత్వ సీట్‌తో ఎమ్మెస్సీ చదివింది. ప్రస్తుతం ఈ-సెట్‌లో ఆరో ర్యాంకు సాధించి రాయపూర్ ఐజీకేవీలో జనటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్‌లో పీహెచ్‌డీ చేస్తుంది. 2025లో ఏఎస్ఆర్‌బీ నెట్, యూజీసీ నెట్- అసిస్టెంట్ ప్రొఫెసర్ అర్హత సాధించిన శ్రీవిద్య తాజాగా ఈజీసీ నెట్-జేఆర్ఎఫ్‌లో 98.4 పర్సంటేజ్ సాధించినట్లు తెలిపింది. ప్రభుత్వ ఉచిత విద్య, ఉపకార వేతనాలను సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివితే ఉన్నత లక్ష్యాలను చేరుకోవచ్చునని ఆమె అభిప్రాయపడ్డారు.

హత్య కేసులో ముగ్గురు నిందితుల అరెస్టు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మేళ్లచెరువు మండలం ఎర్రగట్టు తండాలో ఇద్దరు వ్యక్తులను హత్య చేసిన కేసులో నిందితులు భూక్యా రాము, భూక్యా పెద్ద బాబు, భూక్యా లక్ష్మీలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ శ్రీనివాసరెడ్డి ఆదివారం వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుల ఇంటి పక్కనే అమరబోయిన వెంకటేశ్వర్లు ఇల్లు ఉంది. ఆ ఇంటి వేపచెట్టు ఎండిపోయి ఆకులు, కాయలు, దాని నీడ వీరి ఇంట్లో పడి వీరికి కలిసి రావడం లేదని, దానిని తొలగించాలని వెంకటేశ్వర్లుకు చెప్పారు. ఈ విషయంలోనే వీరి మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. ఇరువర్గాలపైనా కేసులు అయ్యాయి. ఈ నేపథ్యంలోనే వెంకటేశ్వర్లును చంపితేనే సమస్య తీరుతుందని నిందితులు కుట్ర పన్నారు. ముందుగా వేసుకున్న ప్రణాళిక ప్రకారం శనివారం వెంకటేశ్వర్లు ఇంట్లో ఉండగా అతన్ని చంపాలని లక్ష్మీ తన ఇద్దరు కొడుకులు రాము, పెద్ద బాబులను రెచ్చగొట్టింది. ఈ క్రమంలో వారిద్దరు వెంకటేశ్వర్లు ఇంట్లోకి ప్రవేశించి వెంకటేశ్వర్లు తలపై గొడ్డలితో దాడి చేయడంతో అతడు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో వారిని వారించబోయిన వారి తండ్రి భూక్యా సైదులుపై దాడి చేశారు. తమ తండ్రి కూడా వెంకటేశ్వర్లుకు సపోర్టు చేస్తున్నారని తండ్రిపై అక్కసు వెళ్లగక్కారు. తండ్రిని చంపి వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులపై కేసు పెట్టాలని ప్రణాళిక వేశారు. ఈ క్రమంలో గొడ్డలి, కర్రలతో కొట్టడంతో సైదాకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. కోదాడ ఇన్‌ఛార్జి సీఐ రామకృష్ణారెడ్డి కేసు దర్యాప్తు చేపట్టి నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు.



కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, చిత్రంలో నిందితులు

మత్తు..గమ్మత్తుగా గుర్తింపు



పేటెంట్ సంస్థ డైరెక్టర్ శంకర్‌రావు నుంచి జ్ఞాపిక అందుకుంటున్న వసంతారాణి పోతబత్తిని

మఠంపల్లి, న్యూస్‌టుడే: మేధోసంపత్తి రంగంలో నిజామాబాద్ టీజీఎస్‌డబ్ల్యూఆర్ మహిళా కళాశాల డీఎల్ డాక్టర్ వసంతారాణి పోతబత్తిని 'ఓరల్ డ్రగ్ డిటెక్షన్ డివైస్' నూతన ఆవిష్కరణకు భారత ప్రభుత్వం నుంచి డిజైన్ పేటెంట్‌ను పొందారు. సూర్యాపేట జిల్లా మఠంపల్లికి చెందిన పోతబత్తిని యాకోబు, శాంతమ్మ దంపతుల కూతురు వసంతారాణి ఎంఏ, బీఎడ్, పీహెచ్‌డీ పూర్తి చేసి అదే కళాశాలలో ప్రస్తుతం చరిత్ర విభాగానికి హెచ్‌వోడీగా ఉన్నారు. రక్తం, మూత్రం నమూనాల ద్వారా కాకుండా లాలాజలాన్ని(ఓరల్ ఫ్లూయిడ్) పరీక్షించి క్షణాల్లోనే మత్తు పదార్థాలను తీసుకున్న వారిని గుర్తించే పరికరం కనుగొన్న ఆమెకు ఈ అరుదైన గౌరవం లభించింది. నోటి ఉమ్మి నమూనా ఆధారంగా ఆన్-సైట్ ప్రాథమిక డ్రగ్ స్క్రీనింగ్ చేయడానికి ఇది దోహద పడుతుంది. దీని ఆకృతి, నిర్మాణం, బాహ్య రూపకల్పన వంటి ప్రత్యేకతలకు డిజైన్ రిజిస్ట్రేషన్ లభించినట్లు వసంతారాణి పేర్కొన్నారు.

వినియోగ రంగాలు.. ప్రయోజనాలు

డిజిటల్ డిస్‌ప్లే ద్వారా ఫలితాలను వెంటనే తెలుసుకునేలా ఏఐ, ఎల్‌ఓటీ, బ్లూటూత్, డేటా ఎనాలిటిక్స్ వంటి అధునాతన సాంకేతికతను అనుసంధానించి రిమోట్ మానిటరింగ్ చేసేలా దీనిని మరింత అభివృద్ధి చేయవచ్చు. రవాణా, లాజిస్టిక్స్, పాఠశాలల, బస్సు డ్రైవర్ల భద్రతా తనిఖీలు, పరిశ్రమల్లో కార్మికులను పరీక్షించేందుకు వినియోగించవచ్చు. ప్రమాదకర డ్రగ్స్‌పై విద్యాసంస్థలు, వసతి గృహాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించడంతో పాటు కౌన్సెలింగ్ ఇవ్వడానికి వీటిని ఉపయోగిస్తారు.

ఎలా పని చేస్తుందంటే...

ఈ పరికరం వ్యక్తి ఉమ్మి ద్వారా పని చేస్తుంది. రక్తం, మూత్ర పరీక్షలతో పోలిస్తే ఇది సులభంగా, వెంటనే నమూనా సేకరించగలిగే పద్ధతి. పరికరంలో ముందుగానే అమర్చిన ప్రత్యేక స్ట్రిప్స్ ఉంటాయి. నోటి నమూనాలో మత్తు పదార్థాల గుర్తులు ఉంటే అవి రియాజెంట్లతో చర్య జరుపుతాయి. డ్రగ్స్ ఉనికిని బట్టి పరికరం టెస్ట్ లైన్‌పై రంగు మారడం, లేదా మార్కింగ్స్ వస్తాయి. దీంతో మత్తుపదార్థాలు తీసుకున్నారా.. లేదా అనే విషయం ప్రాథమికంగా గుర్తించవచ్చు. ఇది తక్షణ ఫలితాలను ఇచ్చే ప్రాథమిక స్క్రీనింగ్ పరికరం.

మార్గదర్శకులు ఎందరో...



ఓరల్ డ్రగ్ డిటెక్షన్ డివైస్ పరికరం

పరిశోధనలు సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలుగా ఉండాలన్నది తన అభిప్రాయమని వసంతారాణి చెప్పారు. ప్రస్తుత గుర్తింపు మరింత బాధ్యతను పెంచినట్లు తెలిపారు. సుమారు 10 నెలల కఠోర శ్రమ వెనుక ఎందరో మార్గదర్శకులు, సహచరులు ఉన్నట్లు వెల్లడించారు. మేధో సంపత్తి హక్కులను పొందాల్సిన అవసరం నేటి యువతపై ఉందని చెప్పే డా.ఎంఎస్‌కే రావు రీసెర్చ్ అండ్ ఇన్నోవేటివ్ సొల్యూషన్స్ డైరెక్టర్ డా.శంకర్‌రావు ముంజం తనకు స్ఫూర్తి అని తెలిపారు.

ముగిసిన అత్యాపత్య రాష్ట్ర స్థాయి పోటీలు

◆ బాలురలో హైదరాబాద్..
బాలికల్లో నాగర్‌కర్నూల్ విజయం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో అత్యాపత్య అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలబాలికల పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగంలో హైదరాబాద్ జిల్లా జట్టు విజేతగా నిలవగా, బాలికల్లో నాగర్‌కర్నూల్ జిల్లా జట్టు ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. బాలురలో.. రంగారెడ్డి (ద్వితీయ), తృతీయ స్థానంలో నాగర్‌కర్నూల్, సంగారెడ్డి జిల్లాల జట్లు నిలిచాయి. బాలికల విభాగంలో.. నిర్మల్ (ద్వితీయ), తృతీయ స్థానంలో రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాలు నిలవగా. . క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీలు అందజేశారు. అతిథులుగా శేఖర్, లక్ష్మణ్, పోశెట్టి, బ్రహ్మయ్య, అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శి వన్నెల భూమన్న, సంజీవ్ హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరులో జమ్ముకశ్మీర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో హాజరుకానున్నారని అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. రాష్ట్ర పరిశీలకుడు పరమేశ్వర్, బాధ్యులు అజయ్, అమర్‌సింగ్, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు, శిక్షకులు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలిపై అత్యాచారం?

దామరచర్ల, మిర్యాలగూడ పట్టణం, న్యూస్‌టుడే: దివ్యాంగురాలిపై అత్యాచారం జరిగిన ఘటన నల్గొండ జిల్లా దామరచర్ల మండల పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...మండలంలోని ఓ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు (52) తన తల్లితో కలిసి నివాసం ఉంటోంది. ఆదివారం ఉదయం బాధితురాలి తల్లి మిర్యాలగూడలోని ఆసుపత్రికి వెళ్లింది. దివ్యాంగురాలు ఇంట్లో ఒంటరిగా ఉన్న విషయాన్ని గమనించిన అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మధ్యాహ్నం సమయంలో ప్రవేశించి అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. బాధితురాలు కేకలు వేయడంతో ఆమె కాళ్లు, మెడకు తాడుతో కట్టేసి ఆమెపై అత్యాచారానికి పాల్పడినట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడు వెళ్లేటప్పుడు బయటి నుంచి తలుపు వేసి గొళ్లెం పెట్టి తాడుతో కట్టాడు. మిర్యాలగూడలోని ఆసుపత్రికి వెళ్లి వచ్చిన దివ్యాంగురాలి తల్లి ఇంటి తలుపునకు గడియ పెట్టి, దానికి తాడుకట్టి ఉండటంతో కుమార్తెను పేరు పెట్టి పిలవగా ఇంట్లో నుంచి మూలుగులు వినిపించాయి. ఇరుగు పొరుగు వారి సాయంతో తలుపు తెరిచి చూడగా తాళ్లతో కట్టి, ముఖానికి దెబ్బలతో ఉన్న కుమార్తె కనిపించింది. పోలీసులకు సమాచారం అందించడంతో వారు సంఘటనా స్థలాన్ని పరిశీలించి, క్లూస్ టీం సహాయంతో వివరాలు నమోదు చేసుకున్నారు. దివ్యాంగురాలిని వైద్య పరీక్షల నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. దివ్యాంగురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని మిర్యాలగూడ రూరల్ సీఐ పీఎన్‌డీ ప్రసాద్ సందర్శించారు. ఆయన వెంట వాడపల్లి ఏఎస్సై జోజి ఉన్నారు.

రోడ్ల పక్కనే చెత్త



బీబీనగర్ మండలంలోని వెంకిర్యాల, బీబీనగర్, కొండమడుగు గ్రామాల్లో డంపింగ్ యార్డులు ఉన్నా సిబ్బంది చెత్తను రోడ్ల వెంట పడేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే డంపింగ్ యార్డు సరిగ్గా లేదని సమాధానమిస్తున్నారు. గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడంలో ప్రధాన భూమిక పోషించే కార్యదర్శులు మిన్నకుంటుండటంతో చెత్త రోడ్ల పక్కన కనిపిస్తోంది. గ్రామాలకు అనువుగా ఉన్న చోటే డంపింగ్ యార్డులు నిర్మించారు. సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. – న్యూస్‌టుడే, బీబీనగర్

ఆగి ఉన్న వాహనం.. తీస్తోంది ప్రాణం

బీబీనగర్, న్యూస్‌టుడే: జాతీయ రహదారి 163పై రోడ్డు పక్కన నిలిపిన వాహనాలను గమనించక ఇటీవల చాలా మంది మృత్యువాత పడ్డారు. అయినా జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (నేషనల్ హైవే) అధికారులు, ట్రాఫిక్ పోలీసులు తమకేం పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రమాదాలు జరిగినప్పుడు హడావుడి చేసి వదిలేస్తున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి జాతీయ రహదారి పక్కన ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

◆ బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద హైదరాబాద్ మార్గంలో రోడ్డు పక్కనే పండ్లు, తినుబండారాలు అమ్ముతుండటంతో వాటిని కొనుగోలు చేసేందుకు వాహనదారులు ఆగుతున్నారు. వేగంగా వచ్చే వాహనాలు వాటిని గమనించక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.



గూడూరు టోల్‌ప్లాజా వద్ద రోడ్డు పక్కన పండ్లు కొనేందుకు వాహనాలు ఆపిన దృశ్యం

◆ బీబీనగర్ బ్యాంకుల సమీపంలో సర్వీసు రోడ్డుపైనే ద్విచక్ర వాహనాలు నిలుపుతుండటంతో అక్కడ తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

ప్రమాదాలు ఇలా.

☛ 2024లో బీబీనగర్ మండలం కొండమడుగుమెట్టు వద్ద జాతీయ రహదారి పక్కనే ఉన్న క్రిస్టల్ హోటల్ ముందు ఆపి ఉన్న లారీని గమనించక వెనకాలే అతివేగంగా వచ్చిన మ్యాక్స్ వాహనదారుడు లారీని బలంగా ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు.

☛ 2023లో గూడూరు టోల్‌ప్లాజా వద్ద రోడ్డు పక్కన పండ్లు కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై తిరిగి రోడ్డు ఎక్కుతున్న దంపతులను కారు ఢీకొట్టిన ఘటనలో మహిళ అక్కడికక్కడే మృతిచెందింది.

● బీబీనగర్ మండలం రంగాపురంలోని ఎయిమ్స్ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండా రోడ్డు పక్కనే టిఫిన్ సెంటర్లు, టీ స్టాళ్లు, ఔషధ దుకాణాలు వెలిశాయి. వాటికి ఎలాంటి పార్కింగ్ స్థలం లేదు. ఆయా దుకాణాల్లో వస్తువులను కొనుగోలు చేసేందుకు వాహనదారులు రోడ్డుపైనే వాహనాలు నిలుపుతుండటంతో రోజూ ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

● బీబీనగర్ మండలం కొండమడుగుమెట్టు వద్ద రెండు హోటళ్లు రాత్రింబవళ్లు నడుస్తాయి. వాటిలో టీ తాగేందుకు అర్ధరాత్రి సమయాల్లో లారీ డ్రైవర్లు తమ లారీలను రోడ్డు మీదనే ఆపి వెళ్తున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

సామూహిక గృహప్రవేశాలకు పకడ్బందీ ఏర్పాట్లు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

భువనగిరి, న్యూస్‌టుడే: సింగన్నగూడెంలోని రెండు పడకగదుల ఇళ్లలో సోమవారం సామూహిక గృహప్రవేశాలు జరగనున్న నేపథ్యంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు ఆదివారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమ ఏర్పాట్లు, లబ్ధిదారులకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులతో చర్చించారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. తాగునీరు, విద్యుత్తు, పారిశుద్ధ్యం ఇతర మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీవాణి, హౌసింగ్ పీడీ అలివేలు, మున్సిపల్ కమిషనర్ చంద్రప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

వెయ్యి రోజుల కాంగ్రెస్ పాలనపై వారం రోజుల నిరసనలు

◆ మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్

మోత్కూరు, న్యూస్‌టుడే: వందరోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం సెప్టెంబరు 2 నాటికి వెయ్యి రోజుల పాలన పూర్తవుతుందని, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయనందున పార్టీ అధిష్ఠానం నిర్ణయం మేరకు వారం రోజుల పాటు నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్‌కుమార్ తెలిపారు. ఆదివారం మండలంలోని దాచారంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సెప్టెంబరు 2న తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలో 420 హామీల ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ నిరసన చేపడతామన్నారు. 3న కృష్ణానదీ జలాలు శ్రీశైలం దాకా రాకముందే ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుగు గంగ, పోలవరం పేరుతో నాగార్జునసాగర్‌ను నింపకుండా ఆంధ్రాకు తీసుకుపోతున్న క్రమంలో ఎడమకాల్వ రైతుల పక్షాన మిర్యాలగూడలో మాజీమంత్రి కేటీఆర్ ముఖ్యఅతిథిగా నిరసన చేపట్టనున్నట్లు వివరించారు. 4న దివ్యాంగులు, వృద్ధులు, మహిళలకు సంబంధించిన హామీలను నెరవేర్చని కారణంగా తిరుమలగిరి కేంద్రంలో నిరసన చేపడతామన్నారు. 5న, 6న గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయకపోగా ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ పంచాయతీల ఎదుట నిరసన చేస్తామన్నారు. 7న మండల కేంద్రాల్లో నిరసన వ్యక్తం చేసి, ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేస్తామన్నారు. 8న జిల్లా కేంద్రంలో నిరసన చేపట్టి, అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేస్తామన్నారు. సమావేశంలో నాయకులు నేవూరి ధర్మేందర్‌రెడ్డి, టి.మేఘారెడ్డి, మహేంద్రనాథ్, యాకూబ్‌రెడ్డి, రఘునందన్‌రెడ్డి, కె.ప్రభాకర్‌రెడ్డి, టి.సీతయ్య, ఎస్‌ఏ రజాక్, సోమేశ్వర్, మల్లయ్య, ఉప్పలయ్య, తదితరులు పాల్గొన్నారు.



దాచారంలో మాట్లాడుతున్న గాదరి కిశోర్‌కుమార్, నియోజకవర్గ ముఖ్య నాయకులు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)

భువనగిరి పట్టణం: 8008574380, భువనగిరి గ్రామీణం: 8008550364, ఆలేరు: 8008574375, యాదగిరిగుట్ట పట్టణం: 8008574414, మోత్కూరు: 8008574419, చౌటుప్పల్: 8008574968

ఆలేరు, న్యూస్‌టుడే:

? ఆలేరు మండలం కొలనుపాక చిన్నవాగు శ్మశానవాటిక వద్ద నీటి వసతిలేక అంత్యక్రియల సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. నీటి వసతి కల్పించాలి. – నర్సింహులు, కొలనుపాక

✔ విషయాన్ని సర్పంచి, గ్రామ పంచాయతీ పాలకవర్గం దృష్టికి తీసుకువెళతాం. – ఎ.ఉమేష్, పంచాయతీ కార్యదర్శి, కొలనుపాక

వలిగొండ, న్యూస్‌టుడే:

? మండలంలోని పహిల్వాన్‌పురంలోని దుర్గమ్మగుడి సమీపంలో మురుగు నీరు రోడ్డుపైకి రావడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు? – నరసింహారెడ్డి, పహిల్వాన్‌పురం

✔ రోడ్డు పైకి వస్తున్న మురుగు సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భూగర్భ మురుగు కాల్వల నిర్మాణం కోసం కృషి చేస్తాం. – స్నేహలత, పంచాయతీ కార్యదర్శి

యాదగిరీశుడి కల్యాణ వైభవం



శ్రీస్వామి అమ్మవార్ల కల్యాణం

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహ స్వామి సన్నిధిలో ఆదివారం నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. ప్రధాన ఆలయంలో కొలువై ఉన్న అర్చామూర్తులను భక్తులు దర్శించుకున్నారు. ఆలయ ఆచారంగా స్వయంభూ మూర్తులను మేల్కొల్పిన పూజారులు హారతి నివేదన జరిపారు. శ్రీసుదర్శన నారసింహ హోమం, నిత్యకల్యాణం ఆలయ ఆచారంగా నిర్వహించారు. జోడు సేవోత్సవం జరిపారు.

స్వర్ణగిరిలో నిత్యారాధనలు



పద్మావతి అమ్మవారికి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం

భువనగిరి, న్యూస్‌టుడే: స్వర్ణగిరి క్షేత్రంలో ఆదివారం నిత్యారాధలను విశేషంగా చేపట్టారు. శ్రావణమాసం పురస్కరించుకొని ఆదివారం పద్మావతి అమ్మవారికి నవకలశ పూర్వక పంచామృతాభిషేకం నిర్వహించారు. మహాలక్ష్మీ హవనం జరిపారు. నిత్య కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. సాయంత్రం తిరువీధి సేవోత్సవ జరిపారు.

ప్రయాణ ప్రాంగణం.. ఊరికి దూరం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: పట్టణ కేంద్రంలో ప్రభుత్వం 25 ఏళ్ల కిందట రూ.లక్షలు ఖర్చు చేసి బస్టాండ్‌ను నిర్మించింది. నివాసాలకు దూరంగా ఉండటంతో నిరుపయోగంగా మారింది. ప్రయాణికులు రోడ్లపైనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ ఇబ్బంది పడుతున్నారు.



భూదాన్‌పోచంపల్లిలో బస్టాండ్



పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు

– కొంక లక్ష్మీనారాయణ, భూదాన్‌పోచంపల్లి

ప్రపంచ పర్యాటక గ్రామంగా ఉన్న పోచంపల్లిని పర్యాటకులు నిత్యం సందర్శిస్తుంటారు. బస్సుల్లో ప్రయాణించే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్సు కోసం రోడ్డుపైనే నిలబడి వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. వర్షం వస్తే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు బస్‌షెల్టర్ ఏర్పాటు చేయాలి.

ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో బస్సులు ఆయా చౌరస్తాల్లో ఆపకుండా దూరంగా నిలుపుతున్నారు. ప్రయాణికులు పరుగులు పెట్టాల్సి వస్తుంది. సమయానికి గమ్యస్థానాలకు వెళ్లలేకపోతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు.

నిరుపయోగంగా ప్రజా మరుగుదొడ్లు



తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మించిన ప్రజా మరుగుదొడ్లు నీటి సౌకర్యం లేక నిరుపయోగంగా మారాయి. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, స్త్రీశక్తి, ఉపాధి హామీ కార్యాలయాలు ఒకే సముదాయంలో ఉండటంతో రోజుకు చాలామంది వచ్చి వెళుతుంటారు. మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మరమ్మతులు జరిపించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, భూదాన్‌పోచంపల్లి

ఆరోగ్య ఆలేరుగా తీర్చిదిద్దుతాం

ఆలేరు, న్యూస్‌టుడే: ఆలేరు పట్టణంలో ఆరోగ్యకర వాతావరణం కల్పించేందుకు దృష్టి సారించామని పుర ఛైర్‌పర్సన్ బీజన బాలమణి అన్నారు. మేరా యువ భారత్‌లో భాగంగా ఆదివారం యువతకు నిర్వహించిన యూత్ డెవలప్‌మెంట్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. పట్టణ ప్రజలకు అనువైన చోట ఉద్యానవనాన్ని, యువత కోసం ఓపెన్ జిమ్‌ను పురపాలిక నిధులతో ఏర్పాటు చేస్తామన్నారు. యువజన సంఘాల సమితి మండల అధ్యక్షుడు తాళ్లపెల్లి మహేష్ మేరా యువ భారత్ పరంగా యువతకు అందిస్తున్న సహకారం గురించి వివరించారు. యువజన సంఘాల అధ్యక్షులు పూల శ్రావణ్, బరిగె వెంకట్, కృష్ణ, రమేష్ వంశీ, కార్తిక్, నిఖిల్, జీవన్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న పుర ఛైర్‌పర్సన్ బాలమణి

అవీ ఇవీ

డిమాండ్... మోత్కూరు: మోత్కూరు మండలంలోని 22-ఎ నిషేధిత జాబితాలో ఉన్న అర్హులైన రైతుల భూములను వెంటనే పరిశీలించి ఆ జాబితా నుంచి తొలగించాలని భాజపా మండలాధ్యక్షుడు జి.మధుసూదన్ యాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని పనకబండలో రైతుల సమస్యలు తెలుసుకొని విలేకరులతో మాట్లాడారు. ఏళ్ల తరబడి రైతులు సాగు చేసుకుంటూ, హక్కు పత్రాలతో అనుభవిస్తుండగా 22-ఎ జాబితాలో చేర్చడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

ఎన్నిక... మోత్కూరు: మోత్కూరు వెంకటేశ్వర కాలనీ సంక్షేమ సంస్థ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా గట్టు వెంకటేశ్వరరావు, దర్శనం వెంకన్న, గౌరవ అధ్యక్షుడిగా గనగాని నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా డి.విద్యాసాగర్‌రెడ్డి, కోశాధికారిగా కె.నర్సయ్య, సహాయ కార్యదర్శిగా వై.అమరేందర్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

పింఛన్ల దరఖాస్తుకు గడువు పెంచాలి.... తుర్కపల్లి: అర్హులైన వారు చేయూత పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని గిరిజన సర్పంచుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు భూక్య సంతోష్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దరఖాస్తుకు జత చేయాల్సిన ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందక ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

అసెంబ్లీలో గళమెత్తాలని వినతి... చౌటుప్పల్, న్యూస్‌టుడే: మునుగోడు ప్రాంత సాగునీటి సమస్యపై శాసనసభ సమావేశంలో గళమెత్తాలని భారాస శాసనసభా పక్ష ఉప నాయకుడు హరీశ్‌రావును ఈవీల్వీ ఫౌండేషన్ ఛైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ కోరారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేయించాలని, చర్లగూడెం రిజర్వాయర్ ద్వారా సాగునీరు అందించాలని, రాచకొండలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేయాలని, ఫ్లోరిన్ పీడిత మునుగోడు నియోజకవర్గంలో సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని అసెంబ్లీ వేదికగా ప్రశ్నించాలని వినతిపత్రంలో ఆయన కోరారు.

దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన... ఆత్మకూరు(ఎం): మండలంలోని సింగారంలో చావా ఫౌండేషన్, ఆర్కే హాస్పిటల్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. న్యూరోపతి, బీఎండీ, బీపీ మధుమేహ పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. సర్పంచి కె.వనజ, ఉప సర్పంచి ఆంజనేయులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం... మోత్కూరు: మోత్కూరులోని వెంకటేశ్వర కాలనీలో స్వచ్ఛందంగా రూ.2 కోట్లకు పైగా వెచ్చించి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించిన బుజిలాపురానికి చెందిన ఎగమాటి రాంరెడ్డి-అరుణ దంపతులు ఆ ఆలయ అర్చకుడు బ్రహ్మదేవుల వెంకటరమణాచార్యుల పిల్లల చదువుల కోసం రూ.1.50 లక్షల సాయాన్ని ఆదివారం అందజేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ముప్ప వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.మల్లేశం, కోశాధికారి ఎ.వెంకట్‌రెడ్డి, కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉత్తమ కోచ్ పురస్కారం అందజేత...భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: భువనగిరి పట్టణానికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్ మశ్చేందర్ ఉత్తమ కోచ్‌గా అవార్డు సాధించారు. హైదరాబాద్‌లో మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ క్రీడా దినోత్సవంలో అవార్డు అందుకున్నారు.

భారాస నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ... భువనగిరి గ్రామీణం: అనారోగ్యంతో బాధపడుతున్న భారాస మండల నాయకుడు సిల్వేరు మధును మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి మండలంలోని పెంచికల్‌పహాడ్‌లో ఆదివారం ఆయన స్వగృహంలో కలిసి పరామర్శించారు. మండల అధ్యక్షుడు జనగాం పాండు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు జక్క రాఘవేందర్‌రెడ్డి, నాయకులు కేశవపట్నం రమేశ్ పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి పాదయాత్ర

పీర్జాదిగూడ, న్యూస్‌టుడే: యాదాద్రి భువనగిరి జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులకు నిధులు కేటాయించి, త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండీ.జహంగీర్ డిమాండ్ చేశారు. భువనగిరి నుంచి శనివారం చేపట్టిన సీపీఎం మహా పాదయాత్ర రెండో రోజు ఆదివారం మేడిపల్లికి చేరుకుంది. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నరసింహ, అనురాధ, డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్, ఘట్‌కేసర్ మేడిపల్లి మండలం కార్యదర్శులు సబిత, ఎన్.సృజన పాల్గొన్నారు.

కారు బోల్తా.. వ్యక్తి మృతి

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: మండలంలోని మల్లాపురం వద్ద ఆదివారం జరిగిన కారు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం... జిల్లాలోని భువనగిరి మండలం బస్వాపురం గ్రామానికి చెందిన ముదిగొండ నర్సింహ(28), పైళ్ల రంగారెడ్డి, రాసాల కరుణాకర్, చిక్కా మహేష్‌లు కరుణాకర్‌కు చెందిన కారులో ఆలేరుకు వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మధ్యాహ్నం అతివేగంతో, అజాగ్రత్తగా వచ్చిన కారు మల్లాపురం చేరుకోగానే రోడ్డుపై డివైడర్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో డ్రైవర్ వెనక సీటులో కూర్చున్న ముదిగొండ నర్సింహ తలకి గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నర్సింహ జేఎల్‌ఎంగా పని చేస్తున్నాడు. మృతుడి సోదరుడు ముదిగొండ కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాసాల కరుణాకర్‌పై కేసు నమోదు చేసినట్లు యాదగిరిగుట్ట సీఐ భాస్కర్ వెల్లడించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

భువనగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వడపర్తి వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పులపల్లి నరేందర్‌రెడ్డి(35) గ్రామం కూడలిలో నిలబడి ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే ఆయనను భువనగిరి ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టిన మినీ లారీ

మోత్కూరు, న్యూస్‌టుడే: భువనగిరి నుంచి మోత్కూరు మీదుగా వెలుగుపల్లి వద్ద మిల్లుకు ధాన్యం తరలిస్తున్న మినీ లారీ ఆదివారం మోత్కూరు-భువనగిరి రోడ్డులోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌కు ఎదురుగా ఉన్న విద్యుత్తు నియంత్రికను ఢీ కొట్టింది. నియంత్రికతో పాటు స్తంభం కూలింది. లారీ సైతం బోల్తా పడింది. స్థానిక విద్యుత్తు సిబ్బంది హుటాహుటిన నియంత్రికకు మరమ్మతులు చేసి కొత్త స్తంభాన్ని నాటి విద్యుత్తును పునరుద్ధరించారు.

విద్యుత్తు నియంత్రికల నిర్వహణ కరవు

రామన్నపేట, న్యూస్‌టుడే: మండలంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్తు నియంత్రికలకు ఏబీస్విచ్ఛ్‌లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. నియంత్రికలు ఏర్పాటు చేసి సంవత్సరాలు గడుస్తున్నా ఏబీస్విచ్ఛ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో విద్యుత్తు సరఫరా నియంత్రణలో సమస్యలు నిత్యకృత్యం అవుతున్నాయి. మండలంలో గ్రామ పంచాయతీలు 24 ఉన్నాయి. 33 కేవీ విద్యుత్తు ఉపకేంద్రాలు 6 ఉండగా 132 కేవీ ఉపకేంద్రం ఒకటి ఉంది. ఆయా ఉపకేంద్రాల పరిధిలో 10 కేవీ నుంచి 100 కేవీ వరకు 2465 వరకు ఉన్నాయి. వీటిలో 500కు పైగా విద్యుత్తు నియంత్రికలకు ఏబీస్విచ్ఛ్‌లు లేవు. ఫ్యూజు కాలిపోయిన సందర్భంలో కొత్తగా ఫ్యూజ్ వేయడం, ఎల్‌టీ లైన్లలో చిన్నచిన్న మరమ్మతులు, విద్యుత్తు నియంత్రిక పరిధిలో ఏమైనా సమస్య ఏర్పడితే పరిష్కరించడం ఇబ్బందికరంగా మారుతోంది. ఏకంగా విద్యుత్తు ఉపకేంద్రంలో సంబంధిత ఫీడర్ పరిధిలో సరఫరా నిలిపివేయాల్సిన పరిస్థితి. దీంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



బోనమెత్తిన పల్లెలు.. దేవతలకు మొక్కులు



ఆలేరు: కొలనుపాకలో బీరప్ప దేవుడికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు



తంగడపల్లిలో ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు



భువనగిరి: బోనాలతో మహిళల ప్రదర్శన

భువనగిరి, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లో బోనాల వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. గ్రామస్థులు ఇళ్లలో పూజలు నిర్వహించి, డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆలయాలకు చేరుకుని గ్రామదేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

బొమ్మలరామారం: బొమ్మలరామారం, మర్యాల, మైలారం, తూంకుంట గ్రామాల్లో ఆదివారం పోచమ్మ, మహంకాళి, మైసమ్మ అమ్మవార్లకు బోనాలతో నైవేద్యం సమర్పించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

మోటకొండూరు : మోటకొండూరు, మాటూరులో బోనాల పండగ ఘనంగా నిర్వహించారు. మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలు ఎత్తుకొని ఆలయాలకు తరలివచ్చారు.

గుండాల: బ్రాహ్మణపల్లి, సుద్దాల గ్రామాల్లో ఆదివారం ముత్యాలమ్మ, మారమ్మ, పోచమ్మలకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఆలకుంట్ల సుధాకర్, గడ్డమీది మహోదయ్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆలేరు: ఆలేరు మండలంలో ఆదివారం బోనాల వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. ఆలేరు, కొలనుపాక, గుండ్లగూడెం, రాజానగరంలో వివిధ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు నెత్తిన బోనాలతో ఆలయాలకు వెళ్లి కులదైవాలు, గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు.

తుర్కపల్లి : మండలంలోని ఆయా గ్రామాలలో ఆదివారం బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. మాదాపురం, వాసాలమర్రి, తుర్కపల్లి, రుస్తాపురం తదితర గ్రామాలలో పోచమ్మ, దుర్గమ్మ, మైసమ్మ దేవతలకు మహిళలు బోనాలు సమర్పించారు.

చౌటుప్పల్: పురపాలిక పరిధి తంగడపల్లిలో శ్రీఊర ముత్యాలమ్మ తల్లి బోనాల ఉత్సవం ఆదివారం నిర్వహించారు. స్థానిక బొడ్రాయికి, గ్రామ దేవతలకు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. వార్డు కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, కొయ్యడ శేఖర్, ఆలె శ్రీలత, గడ్డం ఇందిర, భక్తులు పెద్ద సంఖ్యలో బోనాల ఉత్సవంలో పాల్గొన్నారు.

వలిగొండ: మండలంలో పలు గ్రామాల్లో భక్తులు బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. మహిళలు నూతన వస్త్రాలను ధరించి ప్రత్యేకంగా అలంకరించిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా వెళ్లి గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



వలిగొండ మండలం వెలువర్తిలో...



రాజపేటలో పోచమ్మ ఆలయానికి బోనాలతో ప్రదర్శనగా వెళ్తున్న స్థానిక పద్మశాలి మహిళలు

సమగ్ర యువజన విధానం అమలు

చౌటుప్పల్, న్యూస్‌టుడే: ప్రభుత్వం సమగ్రమైన యువజన విధానాన్ని రూపొందించి అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చనగోని గాలయ్య, పల్లె శేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. యాదగిరిగుట్టలో సెప్టెంబరు 8, 9, 10 తేదీల్లో నిర్వహించనున్న అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర మూడో మహాసభల సందర్భంగా చౌటుప్పల్‌లో ఉద్యమ నిధిని ఆదివారం సేకరించి మాట్లాడారు. సమాజ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని తెలిసినా పాలకులు యువతను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. శాస్త్రీయ విద్యావిధానం అమలు చేయాలని, యువతకు ఉపాధి కల్పించాలని, స్వయం ఉపాధికి తగిన పెట్టుబడి, ప్రోత్సాహం అందించాలని డిమాండ్ చేశారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు యాదగిరిగుట్టలో ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సీపీఐ జిల్లా సమితి సభ్యుడు దుబ్బాక భాస్కర్, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కొండూరు వెంకటేశ్, మండల కమిటీ అధ్యక్షుడు గుండెబోయిన భాస్కర్, నాయకులు సుధాకర్, రాములు, భిక్షపతి, నర్సింహ, రమేశ్, యాదగిరి, లాలు, కృష్ణ, దర్శన్ తదితరులు పాల్గొన్నారు.



చౌటుప్పల్‌లో ఉద్యమ నిధిని సేకరిస్తున్న సీపీఐ, ఏఐవైఎఫ్ కార్యకర్తలు

పోగొట్టుకున్న పర్సు లభ్యం

యాదగిరిగుట్ట: భక్తురాలి పర్సు పడిపోగా, సీసీటీవీ దృశ్యాల ఆధారంగా ఎస్పీఎఫ్ సిబ్బంది గుర్తించారు. హైదరాబాద్ మలక్‌పేటకు చెందిన ఓ మహిళ తన కుమార్తెతో కలిసి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి ఆదివారం గుట్టకు వచ్చారు. సెల్‌ఫోన్ డిపాజిట్ కేంద్రం వద్ద పర్సును పోగొట్టుకున్నారు. బొట్టు పెట్టే వ్యక్తుల పర్సును తీసుకెళ్లినట్లు గుర్తించారు. వారిని అదుపులోకి తీసుకుని రూ. 4,200, పర్సును స్వాధీనం చేసుకుని బాధితురాలికి అందజేశారు.

సమీకృత వ్యవసాయంపై అవగాహన

బీబీనగర్, న్యూస్‌టుడే: బీబీనగర్ మండలం జమీలపేట గ్రామ రైతు క్షేత్రంలో సమీకృత వ్యవసాయంపై రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. శాస్త్రవేత్త డాక్టర్ అనిల్ రైతులకు సేంద్రియ వ్యవసాయం, రసాయనిక ఎరువుల వినియోగంతో కలిగే నష్టాలు, కృత్రిమ పురుగుమందుల వినియోగం, సహజ పద్ధతులతో పంటల సాగుపై వివరించారు. ఒకే పంట కాకుండా పంటల మార్పిడి, మిశ్రమ పంటల సాగుపై అవగాహన కల్పించారు. సేంద్రియ వ్యవసాయంతో నేల సారం మెరుగుపడుతుందని, భూమిలో సూక్ష్మ జీవుల కార్యకలాపాలు మెరుగుపడతాయని వ్యవసాయ అధికారి పద్మ తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో నవిత, రైతులు నర్సిరెడ్డి, సుభాష్‌రెడ్డి, శ్రీకాంత్, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.



జమీలపేట రైతు క్షేత్రంలో సమీకృత వ్యవసాయంపై రైతులకు అవగాహన

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలి

భువనగిరి, న్యూస్‌టుడే: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ జర్నలిస్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ షానూర్‌బాబా ప్రభుత్వాన్ని కోరారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల స్థలాల సమస్య పరిష్కరించాలన్నారు. కార్పొరేట్ ఆస్పత్రుల్లో హెల్త్‌కార్డులు చెల్లుబాటయ్యేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. జర్నలిస్టుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న, కార్యదర్శి మల్లేశం, సిద్ధులు, మహేష్, నరేష్, రాజు, బురాన్, నరసింహ, రవి పాల్గొన్నారు.